

బాలల దినోత్సవం సందర్భంగా నార్కట్‌పల్లి మండలం పల్లెపహాడ్ గ్రామ సర్పంచ్ సంగిశెట్టి రాణమ్మ శ్రీనివాస్ శనివారం పాఠశాల పిల్లలకు ఆటల పోటీ నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా పాఠశాలకు సంబంధించి వివిధ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.
ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు సిర్రబోయిన పద్మ, గ్రామ సెక్రెటరీ వినోద, స్కూల్ టీచర్లు, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.
-ప్రజాపక్షం/నార్కట్‌పల్లి

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
ఆదివారం | 15 నవంబరు , 2026 | పేజీలు : 6

చెరువుగట్టుకు టెండర్ల ద్వారా రికార్డు ఆదాయం

తలనీలాల టెండర్ రూ.2.75 కోట్లు.. పూల విక్రయ హక్కు రూ.8.50 లక్షలు

గతేడాదితో పోలిస్తే గణనీయంగా పెరిగిన ఆదాయం



ప్రజాపక్షం/నల్లగొండ(నార్కట్‌పల్లి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన చెరువుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి తలనీలాలు, పూల విక్రయ హక్కుల టెండర్ల ద్వారా భారీ ఆదాయం సమకూరింది.శనివారం దేవస్థాన కార్యనిర్వహణాధికారి కార్యాలయం ఎదుట హెచ్1, ఎల్1 విధానంలో నిర్వహించిన బహిరంగ,సీల్డ్ టెండర్లలో గతేడాదితో పోలిస్తే అధిక మొత్తంలో ఆదాయం లభించింది.

తలనీలాల టెండర్ రూ.2.75 కోట్లకు ఖరారు

తలనీలాల సేకరణ హక్కు కోసం నిర్వహించిన బహిరంగ వేలంలో ఐదుగురు, సీల్డ్ టెండర్‌లో నలుగురు పాల్గొన్నారు. బహిరంగ వేలంలో రూ.2,61,51,000 పాట రాగా, సీల్డ్ టెండర్‌లో రూ.2,75,00,000 అత్యధిక ధర కోట్ చేసిన శ్రీభాస్కర హెయిర్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ టెండర్‌ను దక్కించుకుంది. గతేడాదితో పోలిస్తే ఈసారి రూ.25 లక్షల అదనపు ఆదాయం సమకూరినట్లు నిర్వాహకులు తెలిపారు.

పూల విక్రయ హక్కుకు రూ.8.50 లక్షలు

దేవస్థాన పరిధిలో పూలు విక్రయించుకునే హక్కు కోసం నిర్వహించిన టెండర్‌లో బహిరంగ వేలంలో ఇద్దరు, సీల్డ్ టెండర్‌లో నలుగురు పాల్గొన్నారు. బహిరంగ వేలంలో లింగస్వామి రూ.6.50 లక్షలు పాట పాడగా,సీల్డ్ టెండర్‌లో బోగరి రవీందర్ రూ.8,50,001కు టెండర్‌ను దక్కించుకున్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి రూ.2,94,501 అదనపు ఆదాయం లభించింది.ఇతర టెండర్లకు ఆశించిన స్థాయిలో ధరలు రాకపోవడంతో వాటిని వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు,దేవస్థానం చైర్మన్, ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఏడాదైనా అందని నామినేషన్ రుసుములు!



గెలిచిన వారికీ.. డిపాజిట్ అర్హత పొందిన అభ్యర్థులకూ తప్పని ఎదురుచూపులు

నిబంధనల ప్రకారం తిరిగి చెల్లించాల్సిన సొమ్ము ఏమైంది

పెండింగ్‌లో ఉన్న మొత్తాలను వెంటనే చెల్లించాలని అభ్యర్థుల డిమాండ్

ప్రజాపక్షం/మునుగోడు: ఎన్నికల్లో పోటీ చేయాలంటే నామినేషన్ రుసుము చెల్లించాల్సిందే. అయితే ఎన్నికలు ముగిసి,ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు చేపట్టి దాదాపు ఏడాది కావస్తున్నా ఎన్నికల సమయంలో చెల్లించిన నామినేషన్ రుసుములు మాత్రం అభ్యర్థులకు తిరిగి అందడం లేదు. ఎన్నికల నిబంధనల ప్రకారం అర్హులైన అభ్యర్థులకు తిరిగి చెల్లించాల్సిన డిపాజిట్ సొమ్ము ఇప్పటికీ పెండింగ్‌లో ఉండటంపై పలువురు సర్పంచులు, వార్డు సభ్యుల అభ్యర్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నామినేషన్ రుసుముల చెల్లింపులో ఇంత జాప్యం ఎందుకు జరుగుతోంది సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదు? తమకు రావాల్సిన సొమ్ము కోసం ఇంకా ఎన్నాళ్లు ఎదురుచూడాలని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

మునుగోడు మండలంలోని 28 గ్రామపంచాయతీల పరిధిలో 244 వార్డులకు 2025 డిసెంబర్ 11న పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు.ఈ ఎన్నికల్లో 28 గ్రామపంచాయతీల సర్పంచ్ స్థానాలకు 95 మంది, 244 వార్డుల స్థానాలకు 570 మంది అభ్యర్థులు పోటీ చేశారు.నామినేషన్ల సమయంలో సర్పంచ్ స్థానాలకు పోటీ చేసిన ఎస్‌సి,ఎస్‌టి, బీసీ అభ్యర్థులు రూ.500 చొప్పున,జనరల్ కేటగిరీ అభ్యర్థులు రూ.2 వేల చొప్పున రుసుము చెల్లించారు.ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియలో అభ్యర్థులు చెల్లించిన డిపాజిట్‌ను నిబంధనల ప్రకారం తిరిగి చెల్లించడం అధికారుల బాధ్యత. అలాంటప్పుడు ఏడాది కావస్తున్నా చెల్లింపు లు పూర్తి కాకపోవడం వెనుక కారణాలేమిటో అధికారులు వెల్లడించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

ఏడాది కావస్తున్నా డిపాజిట్ రాలేదు

బండమీది యాదయ్య, చల్మెడ సర్పంచ్



చల్మెడ గ్రామ సర్పంచ్ స్థానానికి బీసీ కేటగిరీ నుంచి పోటీ చేసేందుకు రూ.500 నామినేషన్ రుసుము చెల్లించాను.ఎన్నికల్లో విజయం సాధించి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టి దాదాపు ఏడాది కావస్తున్నా ఇప్పటివరకు నామినేషన్ రుసుము తిరిగి అందలేదు.ఎన్నికల నిబంధనల ప్రకారం గెలుపొందిన అభ్యర్థులకు డిపాజిట్ సొమ్ము తిరిగి చెల్లించాల్సి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తమకు రావాల్సిన నామినేషన్ రుసుమును చెల్లించాలని కోరుతున్నాను.

అధికారి వివరణకు ఫోన్‌కు స్పందనలేదు:

ఈ విషయంపై మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్ రెడ్డిని వివరణ కోరేందుకు పలుమార్లు చరవాణిలో సంప్రదించగా ఆయన ఫోన్‌కు స్పందించలేదు.అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రావాల్సి ఉంది.



గ్రంథాలయాలను డిజిటల్ గ్రంథాలయాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా : కలెక్టర్

ప్రజాపక్షం/నల్లగొండ: పుస్తకం మనకు అమ్మలాంటిదని, ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.శనివారం 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డితో కలిసి గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్,బాలల దినోత్సవం సందర్భంగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ,సరస్వతీ దేవి చిత్రపటాలకు పూలమాలలు వేశారు.అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రేడ్1,గ్రేడ్2,గ్రేడ్3 కేటగిరీల్లో మొత్తం 23 గ్రంథాలయాలు ఉన్నాయని తెలిపారు.నేషనల్ డిజిటల్ లైబ్రరీ మిషన్ ద్వారా పాఠకులకు మరిన్ని పుస్తకాలు, విజ్ఞాన వనరులు అందుబాటులోకి తీసుకురావచ్చని చెప్పారు. నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, యువత ప్రతిరోజూ గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదవాలని, సంప్రదాయ పుస్తకాలతో పాటు డిజిటల్ గ్రంథాలయ సేవలను కూడా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ హఫీజ్ ఖాన్,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,స్థానిక కార్పొరేటర్ మామిడి కార్తీక్,గాద వినోద్ రెడ్డి, ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ గోనా రెడ్డి,బాలమ్మ, వేణుగోపాలచార్యులు,విద్యార్థులు,పాఠకులు పాల్గొన్నారు.

నిరాశ్రయ పిల్లలకు మెరుగైన సంరక్షణ అందించాలి : కలెక్టర్

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : అనాథ, నిరాశ్రయ పిల్లలకు మెరుగైన వసతి, విద్య, వైద్యం, సంరక్షణ అందించడంలో బాల సదనాలు, శిశు గృహాలు కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాల సదనం, శిశు గృహాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారుల్లోని సృజనాత్మకత, నైపుణ్యాలను చిన్నప్పటి నుంచే గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె. నరసింహ, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, చైల్డ్ వెల్ఫేర్ కమిటి చైర్‌పర్సన్ రమణారావు, సభ్యులు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రవికుమార్, బాల సదనం సూపరింటెండెంట్ అక్షిత పాల్గొన్నారు.





రాజగోపాల్ రెడ్డిని కలిసిన దైద రవీందర్

ప్రజాపక్షం/నకిరేకల్ : మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అయ్యప్ప స్వామి మాల ధారణ చేసిన సందర్భంగా శనివారం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేసి,అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



ప్రజాపక్షం/మునగాల: మండల పరిధిలోని ముకుందాపురం సమీపంలో ఉన్న ఇందిర అనాధ వృద్ధాశ్రమంలో కోదాడ పట్టణానికి చెందిన ఉమ్మడి నల్లగొండ జిల్లా డిసిసిబి మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు మాతృమూర్తి ముత్తవరపు లక్ష్మమ్మ 19వ వర్ధంతిని పురస్కరించుకుని ఆశ్రమంలోని అనాధలకు, వృద్దులకు, మానసిక వికలాంగులకు అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించారు. ముత్తవరపు పాండురంగారావు లక్ష్మి దంపతులు, వైద్యులు జాస్తి సుబ్బారావు, విశ్రాంత ఉద్యోగి రావెళ్ల సీతరామయ్య, నర్సింహాపురం సర్పంచ్ వేమూరి సత్యనారాయణ, కొమరగిరి రంగారావు, తలశీల రాంబాబు, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, కోఆర్డినేటర్ వాచేపల్లి జ్యోతి పాల్గొన్నారు.

60 మందికి కొత్త పెన్షన్లు

ప్రజాపక్షం/అనంతగిరి: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ప్రధాన లక్ష్యమని వాయిల సింగారం సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు అన్నారు. శనివారం వాయిలసింగారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో నూతన ఫించన్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే ద్వేయంగా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గద్దె రఘు, నాయకులు దాములూరి మురళి, గుండ్లపల్లి వెంకన్న, కొల్లు సుబ్బారావు, బుర్ర వీరబాబు, ఉపసర్పంచ్ రమాదేవి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



చికెన్ సెంటర్ వాహనంలో నగదు చోరీ... నిందితుడి అరెస్టు

బ్యాగు చోరీ కేసును చేధించిన పోలీసులు

ప్రజాపక్షం/నేరేడుచర్ల: చికెన్ సెంటర్‌కు చెందిన బొలెరో వాహనంలో ఉంచిన నగదు బ్యాగును చోరిచేసిన వ్యక్తిని నేరేడుచర్ల పోలీసులు అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి రూ.5వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. హుజూర్‌నగర్ సిఐ చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 13 తేదీ రాత్రి జాన్‌పహడ్ రోడ్డులోని గాంధీ చికెన్ సెంటర్‌లో కోళ్లను దించుతున్న సమయంలో డ్రైవర్, సిబ్బంది పనుల్లో నిమగ్నమయ్యారు. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తి బొలెరో వాహనం క్యాబిన్‌లో ఉంచిన రూ.7వేల నగదు ఉన్న బ్యాగును అపహరించాడు. ఈ ఘటనపై బాధితుడు ధారావత్ సైదా ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా నేరేడుచర్ల ఎస్ఐ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలో మిర్యాలగూడె మండలం గూడురు గ్రామానికి చెందిన చింత లచెర్వు తిరపయ్య ఈ చోరికి పాల్పడినట్లు గుర్తించారు. శనివారం ఉదయం అతడి స్వగ్రామంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని చోరి చేసిన నగదులో ఐదువేలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని రిమాండ్ నిమిత్తం న్యాయస్థానంలో హాజరుపర్చినట్లు సిఐ తెలిపారు. ఎస్ఐ గోపాల్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బాలల గొంతుకకు గ్రామసభ వేదిక



ప్రజా పక్షం/నకిరేకల్ : గ్రామాభివృద్ధిలో చిన్నారులను భాగస్వాములను చేస్తూ, వారి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన బాలల గ్రామసభ మండలంలోని నోముల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం వినూత్నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జి.బ్రహ్మచారి మాట్లాడుతూ జనాభాలో సుమారు 35 శాతం ఉన్న బాలల సమస్యలను ప్రత్యేకంగా గుర్తించి,వారికి అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు బాలల గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.విద్యార్థుల నుంచి వచ్చిన సూచనల ఆధారంగా ప్రత్యేక నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపిస్తామని,తదుపరి గ్రామసభలో వాటిపై తీసుకున్న చర్యల నివేదిక చర్చిస్తామన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు, అభిప్రాయాలు, సూచనలను తెలుసుకున్నారు.సర్పంచ్ పొట్ట బత్తుల జయమ్మ వెంకటేశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ మేక నాగయ్య,ఐసీడీఎస్ సూపర్వైజర్ భవాని,ఉప సర్పంచ్ కోమటిరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి,ప్రధానోపాధ్యాయులు చలమరాజు, ప్రసాద్, ఎంపీఓ రజిత,పంచాయతీ కార్యదర్శి భూపతి రమేష్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి హెచ్చరించారు. సూర్యాపేట పట్టణంలో ద్విచక్ర వాహనంపై ఐదుగురు విద్యార్థులు ప్రయాణిస్తున్న విషయాన్ని గుర్తించిన ట్రాఫిక్ పోలీసులు వారిని ఆపి, తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డుభద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఒకే ద్విచక్ర వాహనంపై పరిమితికి మించి ప్రయాణించడం అత్యంత ప్రమాదకరమన్నారు. ఇలాంటి నిర్లక్ష్యపు చర్యల వల్ల వాహనదారులతో పాటు రహదారిపై ప్రయాణించే ఇతరులు కూడా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు.



అక్రమంగా అండాలు సేకరిస్తున్న వారిపై ఉక్కుపాదం

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : మహిళల నుంచి అక్రమంగా అండాలు సేకరిస్తున్న ఫెర్టిలిటి ఆసుపత్రులపై ఉక్కుపాదం మోపి వాటిని నిషేధించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్లు) రాష్ట్ర అధ్యక్షురాలు జి. అనసూయ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో పిఓడబ్లు జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళల వద్ద అండాల సేకరణ చేస్తూ పెద్ద ఎత్తున దందా నిర్వహిస్తున్న ఫెర్టిలిటి ఆసుపత్రులు, ఇతర కేంద్రాలు, మధ్యవర్తులపై చర్యలు చేపట్టకుండా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. భారత సమ్మిట్‌కు 70 దేశాల నుండి వస్తున్న 300 మందిలో 113 మందికి పైగా ప్రతినిధులను రానివ్వకుండా మోడీ ప్రభుత్వం వీసాలు రద్దు చేస్తూ నిర్ణయించడం భారత దేశ ఔన్నత్యానికి నష్టం చేకూరే విధంగా వ్యవహరించిందని విమర్శించారు. లేనిపక్షంలో పెద్దఎత్తున మహిళా సంఘాల నాయకత్వంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకురాళ్ళు కంచర్ల నర్సమ్మ, అలుగుబెల్లి వాణి, రామలింగమ్మ, పులుసు సుజాత, కాంచనపల్లి మల్లేశ్వరి, కూసు జయసుధ, సైదమ్మ, మంగమ్మ, పద్మ పాల్గొన్నారు.





పేదలకు అండగా ప్రజా ప్రభుత్వం

ప్రజాపక్షం/మోతె : పేదలకు ప్రజా ప్రభుత్వం ఎప్పటికి అండగా ఉంటుందని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. శనివారం మండలంలోని సర్వారం గ్రామానికి చెందిన పలువురికి నూతన పెన్షన్స్ పత్రాలను లబ్ధిదారులకు అందించడంతో మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, లబ్ధిదారులు కలిసి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను అమలు చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంతో పనిచేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి, మాజీ జడ్పిటిసి పందిళ్లపల్లి పుల్లారావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పులి ఈదయ్య, మండల యూత్ అధ్యక్షులు వెలుగు వీరన్న, నాయకులు మేకల గురుకృష్ణ, హలవత్ బాలాజీ, వెంకన్న, రాము, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనం ఇవ్వాలి



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ఆశాలకు రూ.18వేల కనీస వేతనం ఇవ్వాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ నకిరేకంటి కవిత ప్రభుత్వాన్ని కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఏఐటియుసి కార్యాలయంలో యూనియన్ జిల్లా కమిటి సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ప్రభుత్వం పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, రూ.50లక్షల ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి ఆదివారం సెలవుతోపాటు పండుగ సెలవులు 60 రోజులు ఇవ్వాలని, రిటైర్మెంట్ నాటికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండో పిఆర్సిలో ఆశాలకు రూ.30వేలు వేతనాలు నిర్ణయించాలన్నారు. ఏఎన్ఎం ట్రైనింగ్ చేసిన ఆశాలకు ప్రమోషన్ ఇవ్వాలని, ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈ సమావేశంలో ఆశా వర్కర్స్ నాయకురాళ్లు పి. అరుణకుమారి, రాధా, విజయ, భాగ్యలక్ష్మి, ఉమా, సరస్వతి, సుజాత, అనిత, సబితా, కళమ్మ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాపక్షం/నకిరేకల్ : విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరూ ప్రాథమిక హక్కులు,చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని,అది సురక్షితమైన భవిష్యత్తుకు పునాది అని సీనియర్ సివిల్ జడ్జ్ మంజుల సూర్యవర్ సూచించారు. శనివారం మూసీ ప్రాజెక్ట్ వద్ద ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది.ఈసందర్భంగా మాట్లాడుతూ నేటి యువత,విద్యార్థులు పోక్సోచట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, సైబర్ నేరాలు మరియు మాదకద్రవ్యాల దుష్ప్రభావాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పాఠశాల నిర్వహణ, రికార్డులు, రిజిస్టర్లు, విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ వి. సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి కే.బిక్షమయ్య,న్యాయవాదులు గోవిందరాజులు,వెంకన్న,ఉదయ్ కుమార్,టైపిస్ట్ సుజాత తదితరులు పాల్గొన్నారు.





డిస్ట్రిక్ట్ లెవెల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్‌లోని మహాత్మా జ్యోతిరావు ఫూలే బాలికల గురుకుల పాఠశాలలో జిల్లా స్థాయి క్రీడా పోటీలైన డిస్ట్రిక్ట్ లెవెల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌ను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మిర్యాల గూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్య అతి థిగా విచ్చేశారు. ఈ సందర్భంగా బాలల దినోత్స వాన్ని పురస్కరించుకుని విద్యార్థినులతో కలిసి ప్రత్యేక వేడుకలను అత్యంత ఆనందోత్సాహాల మధ్య నిర్వ హించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

న్యూలైఫ్ మినిస్ట్రీస్ ఫౌండర్ జన్మదిన వేడుక



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : న్యూలైఫ్ మిని స్ట్రీస్ ఫౌండర్, జిల్లా పాస్టర్స్ పెలోషిప్ చైర్మన్ రెవ. డా. శాంసన్ మామిడి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని 5వ వార్డు సువెన్ కంపెనీ దగ్గర గల న్యూలైఫ్ మినిస్ట్రీస్ నందు ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో రెవ. డా. యం. ప్రభుదాస్, రెవ. జాన్‌మార్క్, రెవ. మిట్టగడుపుల హోజర్య, రెవ. డాక్టర్ సిహ్న, రెవ. జవహర్ పాల్, పాస్టర్ మాదుగుల సుందర్ రావు తది తరులు ఉన్నారు.

మల్లమ్మ మృతి బాధాకరం

ప్రజాపక్షం/మునగాల: మండల పరిధిలోని బరాఖత్ గూడెం గ్రామ సర్పంచ్ చల్లా గురవయ్య మాతృమూర్తి చల్లా మల్లమ్మ మృతి చాల బాధకరమని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శని వారం ఉదయం చల్లా మల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఆయన నివాసా నికి చేరుకుని ఆమె మృతదేహంపై పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట బిఆర్ఎస్ నాయకులు వేనేపల్లి రమేష్‌బాబు, మాజీ సర్పంచ్ కొప్పుల వీరమ్మ, వార్డు సభ్యులు కుమ్మరి వెంకన్న, రమనబోయిన రమేష్, చల్లా వెంక టయ్య, గంగయ్య పాల్గొన్నారు.



అయ్యప్ప దీక్షలో ఎమ్మెల్యే రాజ్‌గోపాల్‌రెడ్డి



ప్రజాపక్షం/చండూరుః మునుగోడు ఎమ్మెల్యే కోమ టిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి శనివారం చండూరు మున్సి పాలిటీ కేంద్రంలోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప దీక్ష(అయ్యప్ప మాలధార) స్వీకరించారు. ఆయనతో పాటు మరో 100మందికి పైగ శనివారం మాలధారణ స్వీకరించారు. హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం , ఆదివారం ,సోమవారం రోజున విగ్రహా ప్రతిష్ట ,ధ్వజస్తంభం ప్రతిష్ట జరుగనుంది. చండూరు ఆలయ విగ్రహా ప్రతిష్ట సందర్భంగా నూతనంగా నిర్మించిన శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప దేవాలయాన్ని పరిశీలించి జరగబోయే ఉత్సవాల గురించి అడిగి తెలుసుకున్నారు. నూతన ఆలయ ప్రతిష్ట సంద ర్భంగా విగ్రహాల ఊరేగింపు క్రతువులో అయ్యప్ప మాలదారణతో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అయ్యప్ప స్వాములతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ కుభం శ్రీనివాస్ రెడ్డి , చండూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మేకల సాగర్ రెడ్డి , దేవాలయ నిర్మాణ కమిటీ అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు అయ్యప్ప , కట్ట అంజయ్య అయ్యప్ప , కోడి గిరిబాబు , ఐతరాజు మల్లేష్ అయ్యప్ప , అనంత చంద్రశేఖర్ అయ్యప్ప , ఆర్

జాతీయ గ్రంథాలయం వారోత్సవాలు

ప్రజాపక్షం/రామన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో జాతీ య గ్రంథాలయ వారోత్సవాలను ప్రముఖ సాహితీ వేత్త, తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య గ్రంథాలయ పితామహుడు ఎస్. ఆర్.రంగ నాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిం చడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు, అటువంటి గ్రంథాలయాల్ని గ్రామ గ్రామాన నెలకొల్పినప్పుడే ప్రతిఒక్కరు విజ్ఞానవంతులై ఉత్తమ పౌరులుగా రాణి స్తారని అన్నారు. గ్రంధపాలకులు డాక్టర్ రాచమళ్ళ శ్రీను మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉన్నటువంటి వివిధ రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్త కాలు, అకడమిక్ పుస్తకాలు, మ్యాగజైన్లు, జర్నల్స్, వార్తాపత్రికలు అందుబాటులో ఉన్నాయన్నారు.



వారోత్సవాల సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వం, పాటలు, పుస్తక పఠనం మొదలగు పోటీలను విద్యా ర్థులకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సిహెచ్.వెంకట్ గౌడ్,ఎం. అనిత, డాక్టర్ పి.బ్రహ్మం, యస్. బాల రాజు, బి.అమర్, జె. నరేష్, టి.రాంబాబు, బి.శ్రీదేవి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

యాసంగిలో వరి సాగుకు దూరంగా ఉండాలి



ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్ : ఎల్‌నినో ప్రభావం కారణంగా వాతావరణ మార్పుల వల్ల వర్ష పాతం తగ్గినందున,యాసంగి సీజన్‌లో రైతులు వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేసుకో వాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్ పేర్కొన్నారు. రైతులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. భూగర్భ జలాలు తగ్గిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని,నీటి లభ్యత ఆధా రంగానే పంటలు ఎంపిక చేసుకోవాలని, అధిక నీరు అవసరమయ్యే వరి పంటకు బదులుగా జొన్న,పెసర,మినుము,నువ్వులు,వేరుశనగ వంటి ఆరుతడి పంటలు సాగు చేయడం ద్వారా నీటిని ఆదా చేసుకుంటూ పంట సాగు ఖర్చులను తగ్గించు కోవచ్చని తెలిపారు.శనివారం మండల పరిధిలోని కొంపల్లి, శిల్లాపురం మరియు రాజవరం గ్రామాలలో క్షేత్రస్థాయిలో పప్పు దినుసుల పంటలను జిల్లా వ్యవ సాయ అధికారి వినోద్ కుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హాలియా డివిజన్ సహాయ వ్యవ సాయ సంచాలకులు శ్రీమతి సరిత,వ్యవసాయ విస్త రణ అధికారులు ఇ.అరవింద్, కె.నరేష్ మరియు కొంపల్లి గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఎల్ఈడి టీవి

ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మసాన్‌పల్లి గ్రామంలోని ప్రాథ మిక పాఠశాలలో శనివారం బాలల దినోత్సవాన్ని పుర స్కరించుకొని విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటుగా మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ పాఠశాలకు ఎల్ఈడి టీవిని పాఠశాల అందజేయడం జరిగింది. ఈకార్యక్ర మంలో గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, ఫౌండేషన్ ప్రతినిధులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.



సహకార సంఘం సేవలు రైతులు సద్వినియోగం

ప్రజాపక్షం/మునుగోడు :సహకార సంఘం సేవ లను మండల రైతులు సద్వినియోగం చేసుకోవా లని ఉమ్మడి జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్, మును గోడు సహకార సంఘం చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.శనివారం సహకార సంఘం వారోత్స వాల సందర్భంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ఆవరణంలో సహకార సంఘం జెండాను ఆవిష్కరించారు.సహకార గీతం ఆలపించారు. అనంతరం ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు దుబ్బ గోపాలు, సింగం వెంకన్న,మేకల మల్లయ్య, నన్నూరు శేఖర్ రెడ్డి,మార్త మోహన్ రెడ్డి,కూతాటి భిక్షమయ్య,పెర మళ్ళ కిష్టమ్మ పాల్గొన్నారు.





దేవాలయంలో అన్నదానం

ప్రజాపక్షం/మునగాల: మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామంలో స్వయంభుగా వెలసిన శ్రీవెంకటేశ్వర స్వామి దేవాల యంలో ప్రతి శనివారం జరుగుతున్న అన్నదాన కార్యక్రమానికి కోదాడ పట్టణానికి చెందిన సాయిశ్రీ ఆసుపత్రి వైద్యులు దుబ్బాక రాజమోహన్‌రెడ్డి, డాక్టర్ అజిత దంపతుల కుమారుడు సింహత్ రెడ్డి, కుమార్తె చిన్ని, దుబ్బాక మల్లారెడ్డి, పద్మావతి దంపతులు, కుందూరు జనార్ధన్‌రెడ్డి రాజ్యలక్ష్మి దంపతులు భక్తులకు అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ రాజమో హన్‌రెడ్డి, దేవాలయ చైర్మన్ పొలిశెట్టి శ్రీనివాసరావులు మాట్లా డుతూ దాతలు ముందుకు వచ్చి ప్రతి శనివారం జరిగే అన్నదాన కార్యక్రమానికి సహకరించి దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కందాల శ్రీనివాస చార్యులు, దేవాలయ డైరెక్టర్ ఇనుగుర్తి వీరచారి, గుడిపాటి వెంకట రమణ, గ్రామపెద్దలు నరాల వెంకటేశ్వరరావు,దేవరం నర్సిరెడ్డి, బొంతు విజయ్, పుల్లారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పక్కా ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం



ప్రజాపక్షం/గరిడేపల్లి: నిరుపేదలకు పక్కా ఇల్లు కట్టించడమే కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని కాంగ్రెస్‌పార్టీ మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు చాంద్‌మియా అన్నారు. శని వారం మండల పరిధిలోని కేతవారిగూడెం గ్రామంలో నిరుపేద లకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో బాగంగా ముగ్గులు పోయించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సాకారంతో సొంతింటి కల సాకారమైందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమ లు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేదలకు రూ.5లక్ష లతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం గొప్ప వరమన్నారు. ఈ కార్యక్రమంలో మేరిగ రేణుక, రేఖ సైదులు, కొమరాజు నాగయ్య, బండారు సైదులు, ఎస్‌కె సఫీయా, మీరా, అంజయ్య పాల్గొన్నారు

వ్యాధి నిరోధక టీకాల సాన్స్ కార్యక్రమం

ప్రజాపక్షం/మేళ్లచెరువు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మ కంగా అమలు చేస్తున్న యూనివర్శిల్ ఇమ్యునైజేషన్ ప్రొగ్రాం (సా ర్వత్రిక వ్యాధి నిరోధక టీకాలు) మానిటరింగ్‌లో భాగంగా శని వారం మేళ్లచెరువు సబ్ సెంటర్ పరిధిలోని నాయుడు బజార్‌లో అంగన్‌వాడీ సెంటర్‌ను రెగ్యూలర్ ఇమ్యూనైజేషన్ సెషన్ను ఎంపి హెచ్ఎం సిహెచ్ రాజ్‌కుమార్ అకస్మికంగా సందర్శించి పరిశీలిం చారు. ఈ సందర్భంగా కేంద్రంలో చిన్నారులు, గర్భిణీలకు అంది స్తున్న వ్యాధి నిరోధక టీకాల ప్రక్రియతో పాటు సాన్స్ కార్యక్రమం కింద చిన్నారులతో నిమోనియా నివారణ చర్యలను ఆయన క్షుణంగా పరిశీలించారు. వ్యాక్సిన్ల నిల్వ సామార్థ్యం (కోల్డ్‌చైన్ నిర్వహణ) టీకాలు వేసిన వివరాలను సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం జి.కళమ్మ, అంగన్ వాడీ టీచర్ ప్రియాంక, ఆశా కార్యకర్తలు స్వరూప, విజయలక్ష్మి, కరుణ పాల్గొన్నారు.



ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: దేశ భవిష్యత్తుకు బాలబాలికల విద్యే ప్రధాన పునాది అని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భారతదేశ తొలి ప్రధానమంత్రి, భారతరత్న పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినం, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు.



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పిల్లలకు ఆస్తులు, అంతస్తుల కంటే విలువైన సంపద కేవలం చదువే అని పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు అంబటి వీరనారాయణ తెలిపారు. శనివారం బంగారుగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వ హించారు. ఈ వేడుకలకు పాఠశాల ఇంచార్జి ప్రధానోపా ధ్యాయులు అంబటి వీరనారాయణ అధ్యక్షత వహించి, భారత ప్రథమ ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎండీ.ఫెరోజ్, ఆర్.రాంసింగ్, కే యల్లమ్మ, ఎం.రజని, సీహెచ్.వెంకటయ్య, అబేద బేగం, నాగేశ్వర శాస్త్రి, నసీమా బేగం, తదితరులు పాల్గొన్నారు.





ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణంలోని చైతన్యనగర్‌లో గల సెయింట్ జాన్స్, శిష్య స్కూల్లో బాలల దినోత్సవ వేడుకలను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు. ఈ సంద ర్భంగా పాఠశాల ప్రాంగణంలో నెహ్రూ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ప్రిన్సిపాల్ అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కర స్పాండెంట్ శిరీష పాల్గొని బాలల దినోత్సవ ప్రాధాన్యతను తెలియజేశారు.

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: దేశ నిర్మాణం తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుందని, మహనీయుల స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నతంగా ఎదిగి సమున్నత పౌరులుగా తీర్చి దిద్దుకోవాలని ఆదిత్య పాఠశాల కరెస్పాండెంట్ మారుతీ అమరేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. శనివారం భారత ప్రథమ ప్రధానమంత్రి, ఆధునిక భారత రూపశిల్పి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆదిత్య పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బంటు నాగ రాజు, వైస్ ప్రిన్సిపాల్ కట్టా అనిత, ఉపాధ్యాయినీ ఉపాధ్యా యులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.





ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; మండల కేంద్రంలోని రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం పాఠశాల, చిన్నఅడిశర్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, సంజీవని ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను శని వారం ఘనంగా నిర్వహించారు. సంజీవని పాఠశాలలో నిర్వహించిన వేడుకలకు చిన్నఅడిశర్లపల్లి గ్రామ సర్పంచ్ పందుల వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లా డారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌బో పాఠశాల కరస్పాం డెంట్ ఆనంద్‌రెడ్డి, సంజీవని పాఠశాల ప్రిన్సిపల్ కే. రాజా, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రవి, పంచాయతీ కార్యదర్శి గుండాల వెంకటయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదిత రులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం/మర్రిగూడ :మండలంలోని రామ్‌రెడ్డిపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఉపా ధ్యాయ బృందం ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచ్ లప్పంగి నరసింహ భారతదేశ మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.





ప్రజాపక్షం/నాంపల్లి : మండల కేంద్రంలోని స్థానిక గాంధీజీ విద్యాసంస్థల్లో భారత తొలి ప్రధాన మంత్రి,స్వాతంత్ర్య సమరయోధుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో నెహ్రూ చిత్ర పటానికి ట్రస్మా జిల్లా అధ్యక్షులు,గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు,డైరెక్టర్ కర్నాటి నాగరాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్య క్రమంలో పాఠశాల డైరెక్టర్ సరికొండ వెంకన్న,పాఠశాల ప్రిన్సిపల్స్ మద్ది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/నాంపల్లి :మండలంలోని చిట్టంపహాడ్ గ్రామంలో శనివారం గ్రామ సర్పంచ్ కోరే దేవేంద్ర సైదులు ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభ ఏర్పాటుతో జాతీయ బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి గంజి వెంక టేశం,వార్డు సభ్యులు గడ్డం మధు,ఉగ్గపల్లి రాణి యాదయ్య,బుషిపాక లక్ష్మయ్య,ఏకుల సిరియాల వెంకట రాములు, బోయపల్లి యాదమ్మ సైదులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం/నకిరేకల్ : మండలంలోని ఒగోడు ప్రాథమిక పాఠశాలలో శనివారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు సోమ పద్మ,ఉపాధ్యాయులు ఎం.కృష్ణవేణి, కే. శిరుమ, ఏఏహీసీ చైర్మెన్ దొడ్డి శ్రీదేవి, అంగన్వాడీ టీచర్లు కవిత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం/హుజూర్‌నగర్:మున్సిపల్ కార్మికులతో బాలల దినోత్సవం జరుపుకోవడం ఎంతో అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్ అన్నారు. శని వారం పట్టణంలో బాలల దినోత్సవం వేడుకలను వినూ త్నంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సతీష్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మెరిగ అశోక్, పాఠశాల చైర్మన్ తుమ్మ మారెడ్డి, ప్రిన్సిపాల్ రాజారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపక్షం/మోతె : బాలలు దేశ భవిష్యత్‌కు పునాదులని ప్యారా లీగల్ వాలెంటీర్లు గుద్దేటి వెంకన్న, పల్లెల లక్ష్మణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాల, మామిళ్ళగూడెం శ్రీవెంకటేశ్వర విద్యాసంస్థలు, రాఘవాపురం ఎక్స్‌రోడ్డు విజేత పాఠశా లల్లో ఏర్పాటు చేసిన బాలల దినోత్సవం సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో సుప్రీం కోర్టు, రాష్ట్ర హైకోర్టు ఆదేశాల ప్రకారం ప్రతి జిల్లాలోని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటి ఆధ్వర్యంలో ప్యారా లీగల్ వాలెంటర్లు బాలల దినోత్సవం నిర్వహించిన బాలల హక్కులు పరిర క్షణ చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు.



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: బాలలే దేశ భవిష్యత్తు అని, ప్రతి విద్యార్థిలోనూ దాగి ఉన్న అపారమైన ప్రతిభను, సృజ నాత్మకతను వెలికితీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని ఎన్‌వి మోడల్ హైస్కూల్ కరస్పాం డెంట్, ప్రిన్సిపాల్ ఓరుగంటి శ్యామ్‌సుందర్ అన్నారు. మిర్యాలగూడ పట్టణం వాసవి నగర్‌లోని ఎన్.వి. మోడల్ హైస్కూల్లో బాలల దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ప్రథమ ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మర్రిపడిగ గ్రామంలో శనివారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ సర్పంచ్ గూడెపు కుమార్ గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అని ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఏర్పర్చుకొని చదవా లని, చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించా లని ఆయన తెలిపారు. రామారం ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని బాల సభ, స్వపరి





పాలన దిత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈకార్య క్రమంలో ఉపాధ్యాయులు, పంచాయతీ సెక్రటరి మధు, పాలక వర్గం, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/యాదగిరిగుట్ట: మండల పరిధిలోని దాతర పల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం బాలల దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహిం చారు. ఈ వేడుకల్లో గ్రామ కార్యదర్శి శిరీష, ఉప సర్పంచ్ నరసింహ నాయక్, వార్డు సభ్యులు మేడబోయిన స్వామి, బత్తిని కాటంరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/రామన్నపేట: మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ బాలల దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కర స్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ బి సురేష్, అకాడమీ డైరెక్టర్ జేవిఎన్‌ఎస్ మణి పాఠశాల ఉపాధ్యా యులు విద్యార్థులు పాల్గొన్నారు.





సంస్థాన్ నారాయణపురం



నూతనకల్



సూర్యాపేట టౌన్



ప్రజాపక్షం/రామన్నపేట: రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జమీరోద్దిన్ ఆధ్వర్యంలో భారతదేశ తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, ఆధు నిక భారత నిర్మాణ శిల్పి భారతరత్న పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా పాత బస్టాండ్ ఆవరణలో ఉన్న నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిపిఎస్ పాఠశా లలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కొత్తపల్లి అబ్రహం కుమార్, ఉప సర్పంచ్ మోదీ రమేష్, కాంగ్రెస్ నాయకులు బొడ్డు సాలయ్య, గోదాసు గ్రీలు, మీర్జా బషీర్, మొహమ్మద్ నాసర్, మొహమ్మద్ బషీర్ దౌల పాల్గొన్నారు.



విద్యార్థులకు పండ్ల పంపిణీ

ప్రజాపక్షం/రామన్నపేట: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని బోగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ గ్రామసభ నిర్వహించి గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ వార్డుల సమస్యలపై చర్చించారు. అనంతరం అంగన్వాడి కేంద్రంలో, ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అరటిపండ్లు, బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు మేడి అంజనేయులు. కనుక మల్లేష్ నేరటి మానస సురేష్ యాదవ్ , మండల అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శి ఏ సుధా, అంగన్వాడీ టీచర్ బత్తుల వసంత, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పబ్బు జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ గాదె విమలమ్మ, ఆశా వర్కర్ జెల్ల సంధ్య, బోగారం పాఠశాల హెడ్‌మాస్టర్ శ్రీలత పాల్గొన్నారు.

మిర్యాలగూడ జిల్లా సాధన కోసం నేడు అఖిలపక్ష సమావేశం

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడను జిల్లాగా ప్రకటించాలని కోరుతూ నిర్వహించనున్న అఖిలపక్ష సమావేశం వివరాలను వెల్లడిస్తూ మాట్లాడుతున్న జిల్లా సాధన సమితి నాయకులు తదితరులుమిర్యాలగూడ, నవంబర్ 14: మిర్యాలగూడను నూతన జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 11 గంటలకు అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా సాధన సమితి నాయకులు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని ఎన్ఎస్పీ గెస్ట్ హౌస్‌లో ఈ కీలక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం, ప్రాంతీయ సమగ్రాభివృద్ధి కోసం మిర్యాలగూడను జిల్లాగా ప్రకటించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.అలాగే విద్యార్థి, యువజన, మహిళా సంఘాల నాయకులు, మేధావులు, విద్యావంతులు పెద్ద ఎత్తున తరలివచ్చి జిల్లా ఏర్పాటుకు అవసరమైన విలువైన సలహాలు, సూచనలు అందించాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ ఈ సమావేశంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఎన్ఎస్ఎస్ అడ్వెంచర్ క్యాంపుకు కాంటిజెంట్ లీడర్‌గా బాలరాజు

ప్రజాపక్షం /భువనగిరిరూరల్: ఈనెల 18 నుండి 27 వరకు హిమాచల్ ప్రదేశ్ లోని ధర్మశాలలో జరిగే అడ్వెంచర్ క్యాంపు స్టూడెంట్స్ బృందానికి ఎస్ఎల్ఎన్ఎస్ కళాశాల లెక్చరర్ కనక బాలరాజు కాంటిజెంట్ లీడర్‌గా నియమించినట్లు మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి శనివారం తెలిపారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అల్తాఫ్ హుస్సేన్ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఇటువంటి సాహస కృత్యాలను నేర్చుకోవడం ద్వారా సమాజంలో అవసరం వచ్చినప్పుడు సేవ చేయడానికి ముందు ఉండాలని ఆకాంక్షించారు. ఎస్ఎంఎస్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాస్ కాంటిజెంట్ లీడర్ బాలరాజును, అడ్వెంచర్ క్యాంపు స్టూడెంట్ అజయ్లను అభినందించారు.



గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాపక్షం/యాదాద్రిభువనగిరి: యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ అవేస్ చిస్తీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వారోత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రారంభ సమావేశానికి చైర్మన్ ఎండీ అవేస్ చిస్తీ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ హాజరయ్యారు. వేదుకల్లో భాగంగా జ్యోతి ప్రజ్వలన చేసి, సరస్వతీ దేవి చిత్రపటంతో పాటు గ్రంథాలయ పితామహులు డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో, విజ్ఞానాభివృద్ధిలో గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు పోత్నాక్ ప్రమోద్ కుమార్, తంగేళ్లపల్లి రవికుమార్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్, పిట్టల బాలరాజు, ఎండీ మజర్, షరీఫ్ బాయ్, పడిగల ప్రదీప్, కరిపె నరసింహారావు, కొలుపుల అమరేందర్, పలువురు పట్టణ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ సిటిజన్లు తాడూరి కిష్టయ్య పాల్గొన్నారు.



విజయ సంకల్ప దీక్ష

ప్రజాపక్షం/మోత్కూర్: తల్లిదండ్రుల కలలు సాకారం చేయడం కోసం విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడం కోసం మోత్కూరు ఉన్నత పాఠశాలలో శనివారం విజయ సంకల్ప దీక్ష పేరుతో ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వందేమాతరం ఫౌండేషన్ రవీంద్ర మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వ నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్ర చాలా కీలకమని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు కలిసి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. విజయం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవినేని అరవిందరాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, వార్డు కౌన్సిలర్ ప్రమీల, ఏపీపిసి చైర్మన్ పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి గుజ్జ సోమ నరసయ్య, విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధి యాదగిరి, ఉపాధ్యాయులు అంజయ్య రాంప్రసాద్ శ్రీనివాస్, వెంకటయ్య లలిత కుమారి రవీందర్ రెడ్డి కవిత ప్రవీణ్ ఏ వెంకటాచారి స్వప్న రవికుమార్ ఆర్ వెంకటాచారి లింగయ్య ఉప్పలయ్య జయశ్రీ విమలమ్మ వెంకటరమణ వెంకటేశ్వర్లు అశోక్‌తో పాటు సుమారు 75 మందికి పైగా తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాలి



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాల్సిన, బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు సమాజం తీసుకోవాలని మాజీ శాసన మండలి సభ్యులు అలుగు బెల్లి నర్సిరెడ్డి సూచించారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంలోని టౌన్ హాల్‌లో టిఎస్‌యూటిఎఫ్ సూర్యాపేట జిల్లా ఆరవ మహాసభలు టిఎస్‌యూటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమయ్య అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. మహాసభల ప్రారంభానికి ముందు ఉపాధ్యాయులు పట్టణంలోని కొత్తబస్టాండ్ నుండి టౌన్ హాల్ వరకు ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. మహాసభలకు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య రోజు రోజుకు తగ్గుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి నమోదును పెంచాల్సిన బాధ్యతను ఉపాధ్యాయులు, ప్రభుత్వము సమాజం తీసుకోవాలని సూచించారు. ఈ జిల్లా మహాసభలలో టిఎస్‌యూటిఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు సిహెచ్ రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ముదిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశం, టిఎస్‌యూటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గేర నర్సింహా, ఎఫ్‌డబ్ల్యూఎస్ రాష్ట్ర కోశాధికారి ఎడ్ల సైదులు, టిఎస్‌యూటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటి కన్వీనర్ జాగటి యాకయ్య, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ శాసన మండలి వామపక్షాల బలపర్చిన అభ్యర్థి కొల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజకీయాలబ్ధి కోసమే ఇందిరమ్మ ఇళ్ల వివాదం



ప్రజాపక్షం /భువనగిరిరూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం వడపర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల వ్యవహారం రాజకీయ వివాదానికి దారితీస్తోంది. అర్హులైన పేదలకు కాకుండా కాంగ్రెస్ నాయకులకు అనుకూలమైన వారికి ఇళ్లు కేటాయిస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుంటేనే ఇల్లు ఇస్తామని చెబుతున్నారంటూ ఇటీవల గ్రామస్థులు ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలను ఖండిస్తూ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మీడియా సమావేశం నిర్వహించి తమ వాదనను వినిపించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ గ్రామంలో మొత్తం ఇందిరమ్మ ఇళ్ల కోసం 140 దరఖాస్తులు రాగా మొదటి విడతలో 21 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారని, తాజాగా మరో 10 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. అయితే గ్రామంలో ఇళ్ల అవసరం ఎక్కువగా ఉండటంతో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ భువనగిరి డివిజన్ ఎలిమినేటి కృష్ణ రెడ్డి, తోట కూర సురేష్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు ముడుగుల ఆనంద్, వార్డు సభ్యులు కంకురి శ్రీకాంత్, మెడబోయిన బాలయ్య, ముడుగుల రమేష్, జూపల్లి శేఖర్, మాడబోయిన బాల స్వామి, బొబ్బిలి జగత్ పాల్గొన్నారు.



దేశ సైనికుడు ఆర్మీ మహేందర్ మృతి తీరని లోటు

ప్రజాపక్షం/తుర్కపల్లి: దేశ సేవకు అంకితమై, ఆర్మీలో ఉద్యోగం సాధించి, పదిమంది యువకులకు ఆదర్శమైన యువ జవాన్ పల్లపు మహేందర్(మహేష్) కోల్పోవడం తీరని లోటుఅని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తీవ్ర విచారం వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ పల్లపు మహేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడంతో ఆయన కుటుంబాన్ని శనివారం పరామర్శించిన ఎమ్మెల్యే మహేందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ రక్షణ కోసం భారత సైన్యంలో సేవలందించిన మహేందర్ అకాల మరణం అత్యంత బాధాకరమన్నారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. దేశ సేవలో మహేందర్ అందించిన సేవలు ఎప్పటికీ మరువలేనివని, ఆయన త్యాగం, అంకితభావం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



ప్రజాపక్షం/భువనగిరిరూరల్: విద్యార్థులు క్రీడా పోటీలలో పాల్గొనడం వల్ల జీవితంలో గెలుపు ఓటములు సమానంగా తీసుకునే తత్వం ఏర్పడుతుందని జీనియస్ హైస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ బి. సూర్యనారాయణ రెడ్డి అన్నారు. 14 నవంబర్ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలకు శనివారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వారికి బంగారు వెండి, పతకాలు, ట్రోఫీలు అందజేసి మాట్లాడారు. అదేవిధంగా పాఠశాల చైర్మన్ పడాల శ్రీనివాస్ మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులు వ్యాయామం, యోగ లాంటి వాటిని నిత్య సాధన చేయడం వల్ల వారి మేధస్సు పెంపొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ వి. సుచరిత, ఏవో జి. రవి, కోఆర్డినేటర్స్ విజయ, పద్మావతి, ఫాతిమా, జయ, రాణి, సునీత రాణి, జయచిత్ర, ప్రసాద్, పీఈటీలు కే. శ్రీకాంత్, కే. కృష్ణ, జి. వనజ, కే. మౌనిష తదితరులు పాల్గొన్నారు.

'మౌనశబ్దం' పుస్తకావిష్కరణ

ప్రజాపక్షం/మోత్కూర్ : మోత్కూరు వాస్తవ్యుడు రచయిత గంజి రాములు నేత రచించిన 'మౌనశబ్దం' పుస్తకాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న గుప్తా ఘనంగా ఆవిష్కరించారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మౌనశబ్దం పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం పల్లెర్ల వెంకన్న గుప్తా మాట్లాడుతూ పుస్తక పఠనం మనిషి ఆలోచనా విధానాన్ని మెరుగుపరచడంతో పాటు విజ్ఞానాన్ని, సామాజిక అవగాహనను పెంపొందిస్తుందని అన్నారు. రచయితలు తమ రచనల ద్వారా సమాజంలోని భావాలను, అనుభవాలను, వాస్తవాలను అక్షర రూపంలో ప్రజలకు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. రచయిత గంజి రాములు నేత సాహిత్య రంగంలో మరిన్ని మంచి రచనలు చేసి పాఠకుల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. సాహిత్యం సమాజ మార్పునకు దోహదపడే గొప్ప సాధనమని, పుస్తకాలను చదివే అలవాటును ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రచయిత గంజి రాములు నేత, పోచం కన్నయ్య, బొల్లేపల్లి శ్రావణ్ కుమార్, శ్రీధర్, జంపాలా యోగానందం, ఉదయ్ కిరణ్, రాకేష్ చారి తదితరులు పాల్గొన్నారు.





ఆర్థికసాయం అందజేత

ప్రజాపక్షం/వేములపల్లి : మండల కేంద్రానికి చెందిన బొంగర్ల నాగమ్మ అనారోగ్యంతో బాధపడుతూ శని వారం ఉదయం మరణించారు.స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మృతురాలి నివాసానికి చేరుకుని ఆమె భౌతిక దేహంపై పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం దహన సంస్కారాల కోసం 5వేల రూపాయలు అందిం చారు.ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేగటి రవీందర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు పుట్టల (బుంగ) వెంకన్న,మండల నాయకులు దైదగిరి,రావు ఎల్లారెడ్డి,గంజి శ్రీనివాస్, పగడాల వెంకన్న, బొంగర్ల వినోద్, శ్రీను, చంటి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకే అందేలా కృషి



ప్రజాపక్షం/కోదాడ రూరల్ : ప్రభుత్వ సంక్షేమ పథ కాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా గ్రామ పంచా యితీ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుందని గ్రామ సర్పంచ్ పాలకి సురేష్ అన్నారు. శనివారం మండలం లోని దోరకుంట గ్రామ పంచాయితీ కార్యాలయంలో నూతనంగా మంజూరైన సామాజిక భద్రతా ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 59 మంది లబ్ధిదారు లకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్ర మంలో ఉపసర్పంచ్, పంచాయితీ కార్యదర్శి వెంకటే శ్వర్లు, వార్డు మెంబర్లు జాను, పిచ్చయ్య, పాపయ్య, నాగ మణి, వెంకటేశ్వర్లు, రామ్మూర్తి, నాగేంద్ర బాబు, సైదులు, ఆరిఫ్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెహ్రూ 137వ జయంతి వేడుకలు

ప్రజాపక్షం/దేవరకొండ; దేవరకొండ స్పోర్ట్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో శనివారం బాలల దినోత్సవం, నెహ్రూ 137వ జయంతి సందర్భంగా అధ్యక్షులు ఎన్ విటి, సభ్యులు, విద్యార్థులతో కలిసి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎన్‌విటి మాట్లాడుతూ దేశ మొదటి ప్రధాని, ప్రముఖ న్యాయవాది నెహ్రూకి పిల్లలంటే ఎంతో ఇష్టమని, పిల్లలు ఆయన్ను ప్రేమగా చాచా నెహ్రూ అని పిలుచుకునేవారని, పిల్లల సంక్షేమం, విద్య వారి హక్కుల గురించి ఆయన ఎంతో ఆలోచించేవారని అన్నారు. ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, కోశాధికారి కృష్ణకిషోర్, అమర్, నిరంజన్, సురేష్, శ్రీనయ్య, గోపి, మహేందర్, ఆదిత్య, రాజేందర్, క్రీడాకారులు, కళాకారులు, విద్యా ర్థులు పాల్గొన్నారు.



డబుల్ వెంట్ అండర్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : నల్లగొండహైదరా బాద్ రోడ్డు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను శనివారం నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే లైన్ డబ్లింగ్ జరుగుతు న్నందున గతంలో తాను శాసనసభ్యునిగా ఉన్న ప్పుడు హైదరాబాద్ రోడ్డును ఆరు వరుసల రహదా రిగా మార్చుతున్న సందర్భంలో అండర్ బ్రిడ్జి పనులు జరుగుతున్నప్పుడు సింగిల్ వెంట్ అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేశారని తెలిపారు.దానికి తాను తీవ్ర ఆక్షేపణ తెలియజేసి ఈ దారి ట్రాఫిక్‌తో కూడుకున్న దని, సింగిల్ వెంట్ వల్ల ప్రమాదాలు జరిగే అవ కాశం ఉందని, తరచూ ట్రాఫిక్ జామ్ అయ్యే పరి స్థితి ఉంటుందని అధికారులకు తెలిపి పనులు నిలి పివేసినట్లు తెలియజేశారు.అప్పుడు రైల్వే శాఖకు చెందిన ఉన్నతాధికారులు వచ్చి సమస్యను గుర్తించా రని,తాము పోరపాటు చేశామని గ్రహించి డబుల్ వెంట్‌కు అనుమతి ఇచ్చారని, కానీ అందుకు అవస రమైన నిధులు లేవని తెలియజేయడంతో తాను



మాజీ మంత్రి జగదీష్ రెడ్డి సహకారంతో అప్పటి రోడ్డు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డితో మాట్లాడి రూ. 3.5 కోట్లు వెంటనే మంజూరు చేయించామని తెలిపారు. దానితో డబుల్ వెంట్‌కు అవసరమైన బాక్స్‌లను తయారు చేశారని, కానీ ఇప్పటివరకు అవి బిగించకపోవడంతో రోడ్డు ఇరు కుగా మారి వాహనదారులు ఇబ్బంది పడుతున్నా రని తెలియజేశారు.ఆయన వెంట నగర పార్టీ అధ్య క్షులు భువనగిరి దేవేందర్,మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్ రెడ్డి,రేగట్టె మహేందర్ రెడ్డి ఉన్నారు.

విద్యార్థుల సమయానుకూలంగా బస్సులు నడపాలి



ప్రజాపక్షం/దేవరకొండ; కొండమల్లేపల్లి జెడ్పి హైస్కూల్‌లో సుమారు 30 మంది విద్యార్థులు ప్రతి రోజు బస్సు సౌకర్యం విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు ఏఐఎస్ఎఫ్ నాయకుల దృష్టికి తేవడంతో శనివారం దేవరకొండ డిపో మేనేజర్ కార్యాలయంలో వినతి పత్రం అంద జేశారు. దేవరకొండ నుండి నాంపల్లి మీదుగా కాల్వ లపల్లి, రేవెల్లి, తుమ్మలపల్లి గ్రామాలకు వెళ్లే బస్సు సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరుతుండ డంతో పాఠశాలలో నిర్వహించే అదనపు తరగతులు పూర్తికాకముందే విద్యార్థులు బస్సు అందుకోవా ల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు అదనపు తరగతులకు దూరమవుతున్నా రని చదువుకు ఆటంకం కలుగుతోందని తెలిపారు. ముఖ్యంగా 25 నుండి 30 మంది విద్యార్థుల భవి ష్యత్తు, విద్యా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని దేవరకొండ నుండి నాంపల్లికి వెళ్లే బస్సు సమ యాన్ని సాయంత్రం 4.30 గంటల నుండి 5.30 గంటలకు మార్చాలని కోరారు. ఈ సమస్యను పరి ష్కరించి విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ దేవరకొండ ఆర్టీసి డిపోలో కంట్రోలర్‌కూ ఏఐఎస్ఎఫ్ నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు శివ, దేవర కొండ డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ శంషోద్దిన్, విద్యార్థులు అమరేందర్, శివ, సాయి, అనిల్ తదిత రులు ఉన్నారు. విద్యార్థుల విద్యా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసి అధికారులు వెంటనే స్పందించి బస్సు సమయాన్ని సాయంత్రం 5.30గంటలకు మార్చాలని ఏఐఎస్ఎఫ్ నాయ కులు కోరారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్ :మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి స్థానిక సర్పంచ్ పగడాల పున్నమ్మ సైదులు,ఎంఈఓ కొనమంచిలి శ్రీనివాస్ బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ మేరకు చిన్నారులకు చికెన్‌తో విందు భోజనం ఏర్పాటు చేశారు. దివ్యాంగ విద్యార్థులకు శాలువాలతో సన్మా నించి సేవాభావం చాటుకున్నారు.ఈ కార్యక్ర మంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారిణి (ఎస్ఓ) కవిత,ప్రాథమిక పాఠ



శాల ప్రధానోపాధ్యాయురాలు జి.మాధవి,ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది, పసుపులేటి కృష్ణ,అంగన్‌వాడీ టీచర్లు,ఆశా వర్కర్లు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గొర్రె పిల్లలపై కుక్కల స్వైర విహారం

ప్రజాపక్షం/చింతలపాలెం : మండలం లోని తమ్మారం గ్రామంలో చిర్ర రాంబాబు యాదవ్ ఇంటి వద్ద ఉన్న గొర్రెల దొడ్డిలో కుక్కలు జొరబడి స్వైర విహారం చేశాయి. కుక్కల దాడిలో 11 మేకపోతు పిల్లలు మృత్యువాత పడ్డాయి. దీంతో బాధితుడు జీవనోపాధి కోసం అప్పులు చేసి మేకలను కొనుగోలు చేసి వీటినే జీవనాధారంగా జీవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం తరపున పరిహారం అందేవి ధంగా కృషి చేయాలని గ్రామ సర్పంచ్ హనుమయ్యను గ్రామస్తులు కోరారు.





పిల్లలతో స్నేహంగా ఉండి ప్రోత్సహిస్తే అద్భుతమైన ఫలితాలు

ప్రజాపక్షం/నల్లగొండ(దామరచర్ల) : పిల్లలతో స్నేహంగా ఉండి ప్రోత్సహించి అద్భుతమైన ఫలితాలు రాబట్టవచ్చని గ్రామ సర్పంచ్ ధీరావత్ రజిత మల్లు నాయక్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బుజ్జి లింగా నాయక్ తెలిపారు.పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్లే పల్లిలో ఘనంగా జరిగిన బాలల దినోత్సవ కార్యక్రమంలో విద్యార్థు లను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి బాలురే రేపటి పౌరులని, విద్యార్థి దశ నుండే మంచి అలవాట్లు,క్రమశిక్షణ,గురువులను,తల్లి దండ్రులను గౌరవించే గుణగణాలను అలవర్చుకోవాలని,చదువు పట్ల ఆసక్తి పెంచుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠ శాల ప్రధానోపాధ్యాయులు,జిల్లా సమగ్ర శిక్ష ఆర్థిక మరియు గణాంక అధికారి ఎం.బాలాజీ నాయక్, నారాయణ, ఉపాధ్యా యులు గురువారెడ్డి,కవిత,లక్ష్మారెడ్డి,నాగయ్య,శ్రీనివాస్ నాయక్, సయ్యద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



ప్రజాపక్షం/దేవరకొండ; నవంబర్ 15 నుండి 18 వరకు నల్గొం డలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం దేవర కొండ లో ఏఐకేఎస్ జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయు ధ పోరాటానికి చారిత్రక నేపథ్యమున్న నల్గొండ గడ్డపై జాతీ య మహాసభలు నిర్వహించడం ప్రత్యేక ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. నవంబర్ 15న లక్షలాది మంది రైతులతో మహా ప్రదర్శన, బహి రంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు నల్లా వెంకటయ్య, కంబాలపల్లి ఆనంద్, శంకర్, వెంకటేష్, నాగరాజు, కృష్ణయ్య, రాములు, లింగయ్య, విజయ్, శ్రీను, రహీమ్, శ్రీకాంత్, వినోద్, పరమేష్, ముత్తమ్మ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి అన్యాయంపై పోరాడిన వ్యక్తి విద్యాసాగర్ రావు



ప్రజాపక్షం/తుంగతుర్తి : సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతానికి సాగునీటిరంగంలో జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేసిన రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్, సాగునీటి రంగ నిపుణులు అమరజీవి విద్యాసాగర్ రావు అని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు తాటికొండ సీతయ్య అన్నారు. శనివారం విద్యాసాగర్ రావు జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కెసిఆర్ వెంట నడుస్తూ తెలంగాణ ప్రాంతానికి కావాల్సిన నీటివనరుల ఏర్పాటు, ఉపయోగాలు గురించి చర్చించి సూచనలు అందించారని కొనియా డారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్, నాయకులు తునికి సాయిలు గౌడ్, గోపగాని రమేష్ గౌడ్, ఉప్పల నాగమల్లు, నల్లబెల్లి వెంకటేష్, వెంకన్న గౌడ్ పాల్గొన్నారు.